క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో పాల్గుణ మాసం చివరి మంగళవారం కావడంతో స్వామివారికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించారు.

నేడు వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరం


కుశలవ దొర, కోరుకొండ ఎంఈఓ

మధురపూడి: కోరుకొండ హైస్కూల్లో బుధవారం వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్టు ఎంఈఓ టి.కుశలవ దొర తెలిపారు. సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే సదరం సర్టిఫికెట్ స్లాట్ కేటాయింపునకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, రంగంపేట మండలాలకు చెందిన వారికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగంపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని సింగంపల్లి గ్రామానికి చెందిన బోడెం అప్పారావు(79) మోటార్ సైకిల్‌పై కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. కొద్దిరోజుల క్రితం నల్లమిల్లి దాటాక బీరు ఫ్యాక్టరీ సమీపంలోని చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు తీవ్ర గాయాల పాలయ్యాడు. అనంతరం అనపర్తిలో ప్రాథమిక చికిత్స చేసి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినా పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అప్పారావు కుమారుడు బోడెం శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

సారా కేసులో ముగ్గురి అరెస్టు

రంగంపేట: సారా కేసులో ముగ్గురు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఈలకొలను గ్రామ శివారు జీడిమామిడి తోటల్లో అక్రమంగా సారా తయారీ, విక్రయాలు చేస్తున్నట్టు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ముకుందవరం గ్రామానికి చెందిన పంచకట్ల వీరబాబు, పంచకట్ల బుజ్జియ్య, ఈలకొలను గ్రామానికి చెందిన దేవినేని శ్రీనుబాబులను అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించగా నిందితులకు రిమాండ్ విధించినట్టు ఆయన చెప్పారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు


కేంద్ర బలగాల కవాతు సందర్భంగా మాట్లాడుతున్న సీఐ రమేష్

పెదపూడి: మండలంలోని సంపర, శహపురం గ్రామాల్లో ఎస్ఐ శోభనకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సుమారు 50 మంది కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాల అధికారి ఎన్.రమేష్ మాట్లాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చనే ధైర్యం ఓటర్లలో నింపడం కోసమే ఈ కవాతు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దానికి అనుగుణంగా అందరు పని చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

505 మందికి వైద్యసేవలు


శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: చినకొండేపూడి సచివాలయం-2 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 505 మందికి వైద్య పరీక్షలు చేశారు. శ్వాసకోస వైద్య నిపుణులు డాక్టర్ వరుణ్ తేజ, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, డాక్టర్ ఈ.ఏసురాణి, ఆప్తాలమిక్ ఆఫీసర్ కె.సత్యప్రసాద్ వైద్యసేవలు అందించారు. 402 మందికి రక్తం, బీపీ, 13 మందికి ఈసీజీ, 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.దీర్ఘకాల కీళ్లవ్యాధులు ఉన్న ఇద్దరిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఎంపీఎంఈఓ వైఎస్ రాయుడు, ఎంపీహెచ్ఎస్‌లు కె.సుధాకర్, జి.దైవకృప, పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగు.. భూసారం బాగు

- సేంద్రియ పద్ధతులతో ఉపయోగం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు


నరేంద్రపురంలో సాగు చేస్తున్న జీలుగ

రాజానగరం: సాగు చేసిన పంట మంచి దిగుబడిని ఇవ్వాలంటే ఆ భూమి సారవంతంగా ఉండాలి. అందుకోసం ఖరీఫ్, రబీ సీజన్ల అనంతరం వేసవి పంటగా జీలుగ, జనుము, ఉలవ, పిల్లిపెసర వంటి వాటిని రైతులు సాగుచేసి, భూసారాన్ని పెంచే విధంగా కృషి చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో రబీ సీజన్‌లో వరి పంట కోతలు 50 శాతం పైబడి పూర్త వడంతో ఆయా భూముల్లో కొంతమంది రైతులు అపరాలను సాగు చేస్తుంటే, మరికొందరు పచ్చిరొట్టను వేస్తున్నారు. నియోజకవర్గంలోని రాజానగరం మండలం నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, సీతారామపురం, తూర్పుగానుగూడెం, రామస్వామిపేట, పల్లకడియం, గండేపల్లి మండలం, మురారి, గండేపల్లి, రంగంపేట మండలం ఎస్టీ రాజాపురం, వెంకన్నపేట, వడిశలేరు తదితర గ్రామాలలోనూ అపరాలను సాగుచేస్తున్నారు. నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, ముక్కినాడ, పీఆర్సీపురం, అనపర్తి మున్నగు ప్రాంతాలలో వరి పంట కోతలు కాస్త ఆలస్యం కావడం వలన ప్రస్తుతం ఇక్కడ అపరాలతో పాటు భూసారానికి పనికి వచ్చే పచ్చిరొట్ట పైర్లను సాగుచేసే పనిలో రైతాంగం ఉంది.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

భూసారాన్ని పెంపొందించడంపై ఇటీవల చాలా మంది రైతులు శ్రద్ధ వహించడం లేదు. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి పంటను సాగు చేసి, దిగుబడులు అందుకోవడం కోసం ఎక్కువగా రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. దీనివల్ల క్రమేపీ భూసారం తగ్గిపోతుందని, తద్వారా దిగుబడులు కూడా పడిపోతాయని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నవారే ఎక్కువగా ఉన్నారు. ఈ విధంగా పంటలను పండించుకుంటూ భూమిలో సారాన్ని పిండేయడం వలన చౌడు భూములుగా మారే ప్రమాదం లేకపోలేదంటున్నారు. ఈ కారణంగానే రబీ సీజన్ తరువాత మూడో పంటగా భూసారాన్ని పెంచేలా జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి వాటితోపాటు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని సూచిస్తున్నారు.

పాత పద్ధతులతో ప్రయోజనం

రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమేపీ తగ్గిస్తూ, పూర్వకాలం పద్ధతులను అనుసరించేలా పశువుల పెంటను ఎరువుగా పొలాలో వేసి భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. ఈ పైర్లు పూత దశలో ఉండగా ఆ భూమిని దున్నడం వలన వాటిలోని స్థూలపోషకాలు భూమికి చేరి, భూసారం పెరుగుతుంది. వీటిలో నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకూ ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి.

> **భూసారాన్ని పెంచాలి**
>
> రబీ పంట తర్వాత భూసారాన్ని పెంపొందించేందుకు అపరాలు, పచ్చిరొట్ట వేయడం చాలా మంచిది. ఇందుకోసం మినుము, జనుము, జీలుగ విత్తనాలను రైతులు అందించేందుకు ఇండెంట్ పంపించాం. అలాగే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకుంటూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే భూసారాన్ని కాపాడుకోడానికి అవకాశం ఉంటుంది.
>
> – ఎస్‌కే ఇమామి ఖాసిమ్, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు మూలం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్ఓ మాధురి, తహసీల్దార్ సునీల్‌బాబు తదితరులు

అనపర్తి: ప్రజాస్వామ్యానికి ఎన్నికలు మూలమని, దేశ ప్రగతికి ఓటు మార్గదర్శి అని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి అన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ, ఓటు హక్కు వినియోగంపై అధికారులు మంగళవారం అనపర్తిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాధురి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, కొత్తగా ఓటు నమోదుకు సమయం ఉందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విజ్ఞతతో ఓటు వేద్దాం.. అభివృద్ధికి బాటలు వేద్దాం అనే నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేతబట్టి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ఓ, తహసీల్దార్ ఏఆర్ సునీల్‌బాబు, వీఆర్ఓలు, వీఆర్ఏ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి


పెదపర్తిలోని రైసు మిల్లులో కార్మికులను కలిసి ఎన్నికల్లో వారి మద్దతును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని పెడపర్తి తదితర గ్రామాల్లో వివిధ పరిశ్రమలకు వెళ్లి అక్కడి కార్మికులను కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు మంచి జరిగి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వెయ్యండని ప్రజలకు ధైర్యంగా చెప్పగలిగే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ఫలాలు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తామని కార్మికులు తమ మద్దతును ప్రకటించారు. ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి అనపర్తి శేషయ్యమ్మనగర్, ఆంజనేయరెడ్డి నగర్, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెడపర్తి సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ, కుతుకులూరు ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, పడాల తమ్మిరెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్‌దారులపై ప్రతిపక్షాల కపట ప్రేమ

- వారి వల్లే వలంటీర్ల నిలిపివేత
- కోరుకొండలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


కోరుకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: పింఛన్ లబ్ధిదారులపై టీడీపీ, జనసేన నాయకులు కపట ప్రేమ చూపిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇస్తున్న వలంటీర్లను నిలిపివేయాలని వారే ఎన్నికల కమిషన్‌ను కోరారని, మరోవైపు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సీఎస్‌కు, ఎన్నికల అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. కోరుకొండలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు మధ్య జరిగే యుద్ధమన్నారు. దీనిలో సైనికుల్లా పోరాడటానికి అందరూ సిద్ధం కావాలన్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్లు తీసుకోవడానికి వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడతారన్నారు. దీనికి బాబు అండ్ కంపెనీ బాధ్యత వహించాలన్నారు. 2019 నుంచి 2024 వరకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.75 లక్షల కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ఒక చరిత్ర అన్నారు. పేదలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమకు అది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నందెపు శ్రీనివాస్, కోరుకొండ ఎంపీటీసీ సభ్యులు కాళ్ల వీరబాబు, గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా


కొంకుదురులో రాజీనామా చేసిన వలంటీర్లు

బిక్కవోలు: సాయం కోసం ఎదురు చూసేవారికి సేవ చేయలేని కొలువు తమకు వద్దంటూ మండలంలోని కొంకుదురు సచివాలయం 1, 2 పరిధిలో ఉన్న 32 మంది వలంటీర్లు మంగళవారం తమ కొలువులకు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను స్థానిక పంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ ఇంటికి తీసుకెళ్లి ఇస్తే ఎంతో సంతోషించేవారని, వాళ్ల కళ్లల్లో ఆనందం చూసి సంతృప్తిగా సేవలందించేవాళ్లమన్నారు. అలాంటిది ఈ రోజు వాళ్లంతా పింఛన్ ఇంకా ఎందుకు ఇవ్వలేదని దీనంగా అడుగుతుంటే గుండె బరువెక్కుతుందన్నారు. నడవలేని వాళ్ల పరిస్థితి చూసి సచివాలయానికి వెళ్లి తీసుకోమని చెప్పడానికి మనసు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా చేసినవారిలో రమేష్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగబాబు, దుర్గాప్రసాద్, సతీష్, శివలక్ష్మి, అపర్ణ, భవానీ, సునీత, గీత తదితరులున్నారు.

వేలం పాట రెండోసారి వాయిదా


పెదపూడిలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పెదపూడి: స్థానిక సోమేశ్వరస్వామి వారి ఆలయం వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆక్వా సాగు వేలం హెచ్చు పాట రాని కారణంగా రెండోసారి వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ తెలిపారు. దేవాలయానికి చెందిన 6.14 ఎకరాల సాగుభూమికి ఆక్వా సాగు నిమిత్తం వేలం నిర్వహించగా రైతులు ఏడాదికి రూ.1.59 లక్షలకు మాత్రమే పాట పాడారన్నారు. హెచ్చు పాట రాని కారణంగా తమ శాఖ అధికారుల ఆదేశాలతో వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్, కార్య నిర్వహణ అధికారులు సీహెచ్‌వీ రమణమూర్తి, వేణుగోపాల్, రవితేజ, రైతులు కాకర సాయిబాబు, కాకర చందు, సిబ్బంది సుబ్బారావు, శంకర్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో బీసీల అభ్యున్నతి


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో జక్కంపూడి రాజా, కవురు శ్రీనివాస్

రాజానగరం: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి నాడు వైఎస్సార్, నేడు జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేశారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. చంద్రబాబుకు ఎన్నికల సమయంలో మాత్రమే ఈ వర్గాలు గుర్తుకొస్తాయన్నారు. మండలంలోని కలవచర్లలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ సతీమణి రాధికతో కలిసి మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో చేరిన శెట్టిబలిజ, యాదవ సామాజిక వర్గాలకు చెందిన 70 మంది కార్యకర్తలకు పార్టీ కండువాలను మెడలో వేసి, స్వాగతం పలికారు.

104 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఈ గ్రామంలో రూ. ఆరు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అదే టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.13 లక్షలే వెచ్చించారన్నారు. అంతేకాక నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఈ గ్రామంలోనే సుమారు ఐదువేల మంది యువతకు ఉపాధి చూపించే విధంగా 104 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. గడచిన ఐదేళ్లుగా రాష్ట్రంలో జరిగిన జగనన్న అందించిన ప్రజారంజకమైన పాలనను, గతంలో జరిగిన చంద్రబాబు సాగించిన దోపిడీ పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం మరోసారి జగనన్న ప్రభుత్వానికి పట్టం కట్టేలా మీ ఓట్లు ఫ్యాను గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, దంతులూరి రఘువర్మ, అడబాల చినబాబు, వేమగిరి కృష్ణ, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

లేఅవుట్ ఆక్రమణపై అధికారులు స్పందించాలి


లేఅవుట్‌లో గోడ కట్టేందుకు చేస్తున్న సన్నాహాలు

రాజానగరం: గ్రామంలోని పాత జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సూర్యారావుపేటలో కొత్తగా వేసిన లేఅవుట్‌లో జరుగుతున్న ఆక్రమణలపై ప్రశ్నిస్తే.. సంబంధిత వ్యక్తులు గోడే కట్టేస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన ఎస్సీ నాయకుడు ముప్పిడి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఅవుట్ ఏరియా పూర్తిగా పల్లపు ప్రాంతం కావడమే కాకుండా అధిక వర్షాలకు పైగ్రామాల నుంచి ముంపు నీరు వచ్చి చేరుతుందన్నారు. ఇందుకు వీలుగా పక్కనే ఉన్న చాగల్నాడు కాలువపై నుంచి ర్యాంప్ కూడా నిర్మించారన్నారు. అయితే ఈ లేఅవుట్ యజమాని తన వ్యాపారం కోసం ఇప్పటికే పుంత మార్గాన్ని ఆక్రమించి, పక్కా రోడ్డు మార్గంగా చూపడంతో పాటు ఈ ర్యాంప్‌ని కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ముంపు నీరు దిగువకు పోయేందుకు అవకాశం లేకుండా అవసరం అయితే ర్యాంప్‌కి అడ్డంగా గోడ కట్టేస్తానంటూ తమపై ఒంటి కాలిపై లేచాడన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలన చేయాలని కోరారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు చిన్నారులు



స్కేటింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రకాశం నగర్: తిరుపతిలో ఇటీవల జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో దానవాయిపేట గాంధీ పార్కు స్కేటింగ్ విద్యార్థులు పలు విభాగాల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ కెల్లా రాము మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్ – 11 ఇన్‌లైన్ బాలుర విభాగంలో కార్తిక్ బ్రాంజ్ మెడల్, అండర్ – 14 ఇన్‌లైన్ బాలికల విభాగంలో కె.భవ్యశ్రీ మూడు బంగారు పతకాలు, అండర్ – 14 బాలుర విభాగంలో జి.శ్రీవత్సవ్ నాలుగు వెండి,ఒక బ్రాంజ్ పతకం, అండర్ – 17 బాలికల విభాగంలో ఎండీ ముదుసరున్నీసా ఒక వెండి, ఒక బ్రాంజ్ పతకం సాధించారన్నారు. వీరందరూ ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకూ మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రకాశం నగర్: శారద మాత రాజమహేంద్రవరాన్ని సందర్శించి 113 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మంగళవారం 200 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో స్వామి పరిజ్ఞేయానంద చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు పుష్కర ఘాట్‌లోని శారదామాత మంటపంలో పూజలు చేశారు. కార్యక్రమంలో స్వామి వేదవిద్యానందజీ, స్వామి రఘువీర నందజీ పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

- సీలింగ్ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి
- ఎమ్మెల్యే రాజా సతీమణి రాజశ్రీ
- ఉండేశ్వరపురంలో ఎన్నికల ప్రచారం


ఉండేశ్వరపురంలో ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, ఆయనను మరోసారి సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. మండలంలోని ఉండేశ్వరపురంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగారు. నవరత్నాల పథకాలతో రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందన్నారు. ఎంపీగా గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా అనేక పథకాలను జగన్ అమలు చేశారన్నారు. రాజకీయంగా ఎదగాలనే ఆలోచనలతో నామినేటెడ్ పదవులలో వారికి 50 శాతం కేటాయించారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. నియోజకవర్గంలో 20,178 మందికి పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందని, ఇల్లు నిర్మించే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. నియోజకవర్గంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా రెండో పంటకు పుష్కలంగా సాగునీరు అందించిన మన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్రాల జ్యోత్స్న, సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, మల్లిన చౌదరి, మాకిరెడ్డి సాయి కళ్యాణ్, కవల కృష్ణమూర్తి, పట్టపగల విష్ణుప్రసాద్, జొన్నలగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కార్యాచరణ


పొట్టిలంకలో వృద్ధురాలి నుంచి హోం ఓటింగ్‌కు అంగీకార పత్రం తీసుకుంటున్న ఆర్వో తేజ్‌భరత్

కడియం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని రూరల్ ఆర్వో తేజ్‌భరత్ ఆదేశించారు. ఆయన మంగళవారం పొట్టిలంక గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోం ఓటింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. 85 ఏళ్లు ఉన్న ఓటర్లు, 40 శాతం డిజెబిలిటీ ఉన్న దివ్యాంగ ఓటర్ల నుంచి హోం ఓటింగ్ కోసం ధ్రువీకరణ పత్రాలు, ఫారం 12డి స్వీకరిస్తున్నామన్నారు. వీరందరూ ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కలిప్తామన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 267 పోలింగ్ కేంద్రాలలో 1,346 మంది 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, 2,435 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారన్నారు. పొట్టిలంకలోని 236 నంబర్ పోలింగ్ స్టేషన్ పరిధిలో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ఐదుగురు, 19 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలోని రేముళ్ల సుందరమ్మ (89), దివ్యాంగ ఓటరు నిర్మల నుంచి 12డి ఫారాలను జేసీ తేజ్ భరత్ స్వీకరించారు.

తనిఖీలు సక్రమంగా నిర్వహించాలి

కడియం: సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా చూసుకోవడంలో ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్ పోస్ట్ బృందాలు కీలకంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు ఆయన మంగళవారం పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ప్రతి రోజు నిర్దేశించిన లక్ష్యాల మేరకు తనిఖీలు నిర్వహించాలని, అనుమానం కలిగిన వారిపై మరింత దృష్టి సారించాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వాహనాలు, రవాణా వ్యవస్థ, వ్యక్తుల కదలికలపై నిఘాను మరింత ఎక్కువ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.రమాదేవి, కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, డీటీ సుధీర్ ఉన్నారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

కంబాలచెరువు: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సెక్షన్ 144, సెక్షన్ 30 అమలు ఉన్నాయని, ఎటువంటి కార్యకలాపాలకైనా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సౌత్ జోన్ డీఎస్పీ కె.విజయ్ పాల్ మంగళవారం తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచారాలు, జాతరలు, బహిరంగ సభలు, సమావేశాలకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగిల్ విండోలో ఆన్‌లైన్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లౌడ్ స్పీకర్ ఏర్పాటు, బ్యానర్, జెండాల ప్రదర్శన, ఎయిర్ బెలూన్లు, హెలికాప్టర్, హెలిప్యాడ్ వాహనాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే ప్రచార స మయంలో బాణసంచా కాల్చడం పూర్తి నిషిద్ధమన్నారు. అభ్యర్థులు, మద్దతుదారులు బాణసంచా వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.